ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

మంగళవారం 3 సెప్టెంబరు 2024


జిల్లాల వారీగా సగటు వర్షపాతం..

జిల్లా	ఆదివారం	సోమవారం
మహబూబాబాద్	29.67 సెం.మీ	39.40మి.మీ
వరంగల్	15.10 సెం.మీ	53.05మి.మీ
ములుగు	11.30 సెం.మీ	42.20మి.మీ
హనుమకొండ	6.95 సెం.మీ	37.10మి.మీ
జనగామ	5.70 సెం.మీ	0.80మి.మీ
భూపాలపల్లి	2.70 సెం.మీ	28.20మి.మీ





మహబూబాబాద్ మున్నేరు వాగు వద్ద దెబ్బ తిన్న రోడ్డు



ములుగు జిల్లా తాడ్వాయి మండలం ఇందిరానగర్‌లో పొలాల్లో ఇసుకమేటలు



భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో నీట మునిగిన పత్తి చేను



జనగామ మండలం గానుగుపహాడ్ శివారులోని కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్



కేసముద్రంలో ధ్వంసమైన వెంకటగిరి రోడ్డు



నెక్కొండ మండలంలో దెబ్బతిన్న పత్తిపంట

వాన బీభత్సం.. తీరని నష్టం

- భారీ వర్షంతో ఉమ్మడి వరంగల్ జిల్లా అతలాకుతలం
- వరదకు దెబ్బతిన్న పంటలు, రోడ్లు
- పొలాల్లో ఇసుక మేటలతో రైతుల కన్నీళ్లు

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్)

భారీ వర్షాలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీభత్సం సృష్టించడంతో తీరని నష్టం మిలిగింది. అనేక చోట్ల వాగులు, వంకలు చెరువులు ఉప్పొంగడంతో పాటు వరద తీవ్రతకు పలుచోట్ల పంటలు నీట మునిగాయి. పొలాల్లో ఇసుకమేటలు వేశాయి. అనేక చోట్ల వాగులపై వంతెనలు, అంతర్గత, ప్రధాన రహదారులు ధ్వంసమయ్యాయి. చెరువు కట్టలు తెగిపోయాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు భారీ నష్టమే వాటిల్లింది.

మహబూబాబాద్ జిల్లాలో సుమారు 27,639 ఎకరాల్లో పంటలు నీటిపాలయ్యాయి. మహబూబాబాద్ జిల్లాలో 1,590చెరువులు ఉండగా అందులో 53చెరువుల కట్టలు తెగిపోయాయి. పాలేరు, ఆకేరువాగులపై మూడు చెక్‌డ్యాంలు కొట్టుకుపోగా, వరద ఉధృతి తగ్గితే మరికొన్ని బయటపడే అవకాశం ఉంది. అలాగే జిల్లా వ్యాప్తంగా 15ప్రాంతాల్లో అర్‌అండ్‌బీకి చెందిన అనేక రోడ్లు కోతకు గురయ్యాయి. సుమారు 28వేల ఎకరాలు నీటమునిగినట్టు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక నిర్ధారణ కొచ్చినట్టు తెలుస్తోంది. మహబూబాబాద్ పట్టణంలో వర్షబీభత్సంతో దెబ్బతిన్న రోడ్లను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి పరిశీలించారు. వారి వెంట అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, ఆర్డీవో అలివేలు, మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న ఉన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మున్నేరు వాగు వద్ద విరిగిన విద్యుత్ స్తంభాలను టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి పరిశీలించారు. జిల్లాలో 400 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని, కొన్నిచోట్లఫీడర్ చానళ్లు దెబ్బతిన్నాయని, 11 సబ్ స్టేషన్‌లలోకి నీళ్లు వచ్చాయని, పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని ఆయన వెల్లడించారు. మహబూబాబాద్ మండలం రాళ్లవాగులో ఆదివారం రాత్రి డీసీఎం వ్యాను కొట్టుకుపోయిన ఘటనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రికి చెందిన నాగభూషణం అచూకీ ఇంత వరకు లభించలేదు. తొర్రూరు మండలం వెంకటపురం వాగులో గల్లంతైన వ్యక్తి చిన్న సోమయ్య మృతదేహాన్ని సోమవారం పోలీసులు వెలికితీశారు.



హనుమకొండ బస్టాండ్ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్డు

రెండురోజుల పాటు కుండపోత వాన తీవ్ర నష్టాన్ని మిగల్చగా.. సోమవారం మోస్తరు జల్లులు మాత్రమే పడ్డాయి. దీంతో ములుగు జిల్లా తేరుకుంటోంది. వరదల భయంతో బిక్కుబిక్కుమన్న లోతట్టు ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. వాగుల ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతున్నా వందలాది మంది పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్నారు. తాడ్వాయి మండలం మొండెలతోగు, జలగలంచ వద్ద జాతీయ రహదారి వరదలకు ధ్వంసం కావడంతో శనివారం సాయంత్రం

మిగతా 7వ పేజీలో..


నేడు మహబూబాబాద్ జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి

మరిపెడ, నెల్లికుదురు మండలాల్లో సందర్శనకు ఏర్పాట్లు

మహబూబాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో అతలాకుతలమైన మహబూబాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం పర్యటించనున్నారు. సోమవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న ఆయన తిరుగు ప్రయాణంలో మహబూ బాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న జిల్లా అధికార యంత్రాంగానికి మరిపెడ, నెల్లికుదురు మండలాల్లోని వరద బీభత్స ప్రాంతాల్లో సీఎం సందర్శించేలా ఏర్పాట్లు చేశారు. భారీ వర్షంతో మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం హైలెవల్ వంతెనకు ఇరువైపులా అప్రోచ్‌రోడ్డు కొట్టుకుపోవడంతో ఈ దారిలో రాకపోకలు స్తంభించాయి. మరోపక్క నెల్లికుదురు మండలం రావిరాలలో చెరువు తెగడంతో తీవ్రంగా పంటల నష్టం వాటిల్లింది. ఈ రెండు గ్రామాల్లో సీఎం పర్యటించనున్నారు.

నీటమునిగిన పంటలు.. కొట్టుకుపోయిన బ్రిడ్జి

జిల్లాలో భారీ వర్షంతో అపార నష్టం వాటిల్లింది. అధికారుల ప్రాథమిక నివేదిక మేరకు దాదాపు 28వేల ఎకరాలు నీట మునిగాయి. 15 ప్రధాన రోడ్లు కోతకు గురయ్యాయి. మహబూబాబాద్ నుంచి కురవి మీదుగా ఖమ్మం వెళ్లే రోడ్డులోని ముల్కలపల్లి హైలెవల్ వంతెన 8 పిల్లర్ల మీద స్లాబ్ కొట్టుకుపోయింది. మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం, ఉగ్గంపల్లి హైలెవల్ వంతెనలకు ఇరువైపులా అప్రోచ్‌రోడ్లు కొట్టుకుపోవడంతో మరిపెడ, సూర్యాపేట, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి మహబూ బాబాద్‌కు రవాణా సౌకర్యాలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క సోమవారం వర్ష బీభత్స ప్రాంతాలను అధికారులతో కలిసి సందర్శించి పరిస్థితిని రేవంత్‌రెడ్డికి వివరించిన క్రమంలో సీఎం మహబూబాబాద్ జిల్లాలో పర్యటించాలని నిర్ణయించుకున్నారని సమాచారం.





ఇంటికన్నె సమీపంలో రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు చేస్తున్న యంత్రాలు

యుద్ధ ప్రాతిపదికన ట్రాక్ మరమ్మతులు

- ఇంటికన్నె వద్ద రైల్వే ట్రాక్ వేలాడుతున్న ప్రాంతంలో 8 ప్రొక్లెయినర్లతో వేగంగా పనులు
- పరిశీలించిన రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్

వివరాలు : 7లో..

అధైర్యం వద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది

- అధికారులు సేవా దృక్పథంలో పనిచేయాలి
- ముందస్తు ప్రణాళికతో తగ్గిన నష్టం
- ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలి
- ముంపు ప్రాంతాల పర్యటనలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



కేసముద్రంలో ముంపు బాధితులను ఓదార్చుతున్న మంత్రి సీతక్క

ఒంటిపై పెట్రోల్ పోసుకున్న చిట్స్ వ్యాపారి

భార్యతో కలిసి ఆత్మహత్యాయత్నం



ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న నరేందర్, లావణ్య దంపతులు

ములుగు, సెప్టెంబరు 2: ములుగు లోని ఓ ప్రైవేటు చిట్‌ఫండ్ కార్యాలయం ఎదుట సోమవారం దంపతులు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. ములుగు మండలం జాకారం గ్రామానికి చెందిన తోట నరేందర్ తన బంధువు అయిన ములుగు చెందిన నూనె భిక్షపతితో కలిసి కొన్నేళ్లుగా చిట్స్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. లావాదేవీల విషయంలో ఇద్దరి మధ్య విబేధాలు వచ్చాయి. తనకు రూ.95లక్షలతో పాటు రెండు ఓపెన్ ప్లాట్లు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నామని, ఏళ్లు గడుస్తున్నా సెటిల్ చేయకుండా ఇబ్బంది పెడుతున్నాడని నరేందర్ ఆరోపించారు. ఈవిషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశామన్నారు. సోమవారం ఉదయం ములుగులోని చిట్‌ఫండ్ కార్యాలయం ఎదుట నరేందర్ తన భార్య లావణ్యతో కలిసి ఒంటిపై పెట్రోల్ పోసుకోగా స్థానికులు అడ్డుకున్నారు. ఘటనా స్థలికి చేరుకున్న ఎస్సై వెంక టేశ్వర్‌రావు వారిని స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్(ఫైల్)

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 2: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగు ళ్లపల్లికి చెందిన కొడారి కొమురయ్య-లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు శ్రీకాంత్ (27) ఉన్నారు. డిగ్రీ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటున్న శ్రీకాంత్ తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సహకరిస్తున్నాడు. తనకు ఖర్చుల నిమిత్తం కొన్ని డబ్బులు కావాలని తల్లిదండ్రులను అతడు అడగ్గా వారు ఇవ్వడానికి నిరాకరించారు. దీంతో మనస్తాపం చెందిన శ్రీకాంత్ ద్విచక్రవాహనంపై కరీంనగర్ జిల్లా జమ్మికుంట రైల్వేస్టేషన్ పరిధిలోని బిజిగిరిషరీఫ్ గ్రామం వద్దకు వెళ్లి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు అవివాహితుడు. శ్రీకాంత్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మా కొడుకు జాడ కనుక్కోండి

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు బయ్యక్కపేట దంపతుల విజ్ఞప్తి

గతేడాది ఇరాన్ సముద్రంలో గల్లంతైన యువకుడు



బండి సంజయ్‌కు వివరాలు చెబుతున్న యువకుడి తండ్రి

మేడారం, సెప్టెంబర్ 2 : గత ఏడాది ఇరాన్‌లోని సముద్రంలో మునిగి గల్లంతైన తమ కొడుకు జాడను కనుక్కోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు తాడ్వాయి మండలం బయ్యక్కపేట గ్రామానికి చెందిన గుర్రం సమ్మిరెడ్డి, రమ దంపతులు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్‌లోని మంత్రి నివాసంలో సోమవారం ఆయన్ను కలిశారు. ఇరాన్‌లో నేవీ ఉద్యోగం చేస్తున్న గుర్రం శ్రీమాన్ (24) విధుల్లో ఉండగా ప్రమాదవశాత్తు ఆ దేశంలోని సముద్రంలో 2023 డిసెంబరు 23న గల్లంతయ్యాడు. ఎనిమిది నెలలు కావస్తున్నా అతడి ఆచూకీ లభించలేదు. అప్పటి నుంచి తమ కొడుకు జాడ కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందని బండి సంజయ్ ఎదుట సమ్మిరెడ్డి దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. వీరి విజ్ఞప్తిపై బండి సంజయ్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే శ్రీమాన్ ఆచూకీ తెలుసుకుంటానని హామీ ఇచ్చారు.

కూలిన విద్యుత్ స్తంభాలను సరిచేస్తున్నాం

టీజీఎన్‌పీడీసీఎల్ సీఈ భీకంసింగ్



విరిగిన విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న సీఈ భీకంసింగ్

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 2: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను వెనువెంటనే సరిచేస్తున్నామని టీజీఎన్‌పీడీసీఎల్ సీఈ (కన్‌స్ట్రక్షన్) భీకంసింగ్ తెలిపారు. సూపరింటెండెంట్ మల్హార్ నాయక్‌తో కలిసి పలు ప్రదేశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాల కారణంగా 223 స్తంభాలు, తొమ్మిది ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయని తెలిపారు. వాటితో ఏర్పడిన విద్యుత్ అంతరాయాలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఇప్పటికే ఆయా పనుల్లో సిబ్బంది నిమగ్నమయ్యారని తెలిపారు. వర్షాల దృష్ట్యా విద్యుత్ వినియోగదారులు పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంట్లో ఉన్న విద్యుత్ తీగలు, ప్లగ్గులు, స్విచ్‌లను తడిచేతితో ముట్టుకోకూడదని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే 79016 28362, 18004 250028 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

కాటారం, సెప్టెంబరు 2: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రం గా గాయపడిన సంఘటన మండలం లోని మేడిపల్లి అటవీప్రాంతంలో 353(సీ)జాతీయ రహదారిపై సోమ వారం చోటుచేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్హర్ మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన రామిడి సాయిరాం, కామ మహేష్ బైక్‌పై భూపాలపల్లి వెళ్తున్నారు. అదే సమ యంలో కాటారం నుంచి భూపాలపల్లి వైపు వెళ్తున్న లారీ మేడిపల్లి అటవీ ప్రాంతం వద్ద బైక్‌ను వెనక నుంచి ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై నుంచి ఎగిరిపడ్డ సాయిరాం, మహేష్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని వాహనదారులు 108 అంబులెన్స్‌లో భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ప్రమాదం జరిగిన స్థలాన్ని సందర్శించారు.



తీవ్రంగా గాయపడ్డ యువకుడు

ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి

అధికారులతో కలెక్టర్ రాహుల్ శర్మ



గోదావరి వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

మహదేవపూర్, సెప్టెంబరు 2: భారీ వర్షాల దృష్ట్యా ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. మండలంలోని కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతిని ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం ముంపు గ్రామం పుసుకుపల్లిని సందర్శించారు. గ్రామస్థులతో మాట్లాడి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల మేరకు భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోందని, పరీవాహక, ముంపు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. అవసరమైతే వారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షం కురిస్తే గోదావరి ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందని, ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు తనకు సమాచారాన్ని అందించాలన్నారు. గోదావరిలో స్నానాలు ఆచరించేందుకు భక్తులను అనుమతించొద్దన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి వీరభద్రయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాథోడ్ ప్రహ్లాద్, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ సూర్యప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి సత్యానారాయణ, సీడబ్ల్యూసీ సైట్ ఇంజనీర్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ములుగు అడవిలో చిరుత సంచారం

పాదముద్రలను గుర్తించిన ఫారెస్టు అధికారులు

ములుగు, సెప్టెంబరు 2: ములుగు మండల అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం వెలుగులోకి వచ్చింది. మదనపల్లి రైతులు సోమవారం ఉద యం కోమటి చెరువు అటవీ ప్రాంతంలోని పొలా లకు వెళ్తుం డగా ఓ పత్తిచేనులో పులి పాదము ద్రలను పోలిన ఆనవాళ్లను గమనించి అటవీశాఖ అధికా రులకు సమాచారం ఇచ్చారు. ములుగు ఎఫ్‌ఆర్‌వో డోలి శంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా



చిరుత పులి పాదముద్రలు

మిగాతా 8వ పేజీలో...



శ్రీవారిని దర్శించుకున్న మార్నేని దంపతులు

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 2: తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్, అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ దంపతులు దర్శించుకున్నారు. సోమవారం వారు స్వామివారిని దర్శించుకున్నారు.



విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 2 : చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొం దించాలని సెన్సార్ బోర్డు మెంబర్ ఆకుల నాగేశ్వర్ అన్నారు. సోమవారం బాలసము ద్రంలోని సామాజగన్మోహన్ ఆ కార్యక్రమాన్ని చేపడుతున్న భారత్ వికాస్ పరిషత్ ఆధ్వ ర్యంలో దేశభక్తి బృందగీతాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వర్‌రావు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొం దించే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్న భారత్ వికాస్ పరిషత్‌ను అభినందించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆహుతుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్, సెక్రెటరీ కె. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

8న టీపీయూఎస్ గురుపూజోత్సవం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 2 : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) ఆధ్వర్యం లో ఈ నెల 8న గురుపూజోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు రెండు జిల్లాల ప్రతినిధులు సతీష్, శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని సామాజగన్మోహన్ స్మారక భవనంలో ఆదివారం ఉద యం 10 గంటలకు టీపీయూఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెండు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని వారు కోరారు.

తప్పిపోయిన వృద్ధురాలు

● చేరదీసిన పోలీసులు ● కుటుంబ సభ్యులకు అప్పగింత


వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

మడికొండ, సెప్టెంబరు 2: ఇంటి నుంచి బయటకు వచ్చి అడ్రస్ మర్చిపోయిన వృద్ధురాలిని గుర్తించిన పోలీసులు ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మడికొండకు చెందిన తలగాని సరోజ అనే వృద్ధురాలు సోమవారం ఇంటి నుంచి బయటికి వచ్చింది. వృద్ధురాలు కావడంతో వయసు రీత్యా అడ్రస్ మర్చిపోయి తిరిగి ఇంటికి వెళ్లలేక అక్కడక్కడ తిరుగుతూ ఉంది. ఈ విషయం తెలిసిన పలువురు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ బాధితురాలిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వచ్చి వివరాలు తెలుసుకుని ఆమె కుమారుడు సంతోష్‌కు అప్పగించారు. ఈసందర్భంగా బాధిత వృద్ధురాలి కుమారుడు సంతోష్ ఇన్‌స్పెక్టర్ కిషన్, ఎస్సైలు రాజబాబు, దివ్య, హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, పోలీసులను అభినందించారు.

6న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 2: జిల్లా ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 6న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి కల్పనాధికారి సీహెచ్. ఉమారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ హైదరాబాద్‌లో వర్చువల్ కేర్, ఎస్ బ్యాంక్ హైదరాబాద్‌లో సీనియర్ ఆఫీసర్, ముత్తూట్ ఫైనాన్స్ హైదరాబాద్, వరంగల్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఉమ్మడి వరంగల్ జిల్లాలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ల ఉద్యోగాలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 22 నుంచి 35 ఏళ్ల వయస్సు గల అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని ఆమె తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు శుక్రవారం ఉదయం 11 గంటలకు ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

ముగిసిన జిల్లా స్థాయి చెస్ టోర్నీ


రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 2 : తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చెస్ పోటీలు ముగిశాయి. అండర్-11 బాల బాలికల విభాగంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలల్లో 70 మంది బాలబాలికలు పాల్గొన్నట్లు క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన నలుగురు బాలురు, నలుగురు బాలికలను ఈనెల చివరి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న అండర్-11 చెస్ పోటీలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్స్ ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ వైశాలి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

-రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు:

- బాలుర విభాగంలో డీ అభినవ్‌సాయి, ఆయుష్, అద్విక్, జితేశ్
- బాలికల విభాగంలో జాన్సీ, వైష్ణవి, అస్మిత, అక్షయ














జనగామ జిల్లా చిలుపూరు మండలం పల్లగుట్టలో కోతకు గురైన రోడ్డు


భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో వరద నీటిలో మునిగిన వరి పొలాలు


వర్ధన్నపేట మండలం ఇల్లంద శివారులో ఆకేరువాగు ఉప్పొంగడంతో కోతకు గురవుతున్న ప్రాంతం

వాన బీభత్సం.. తీరని నష్టం

5వ పేజీ తరువాయి

నుంచి సోమవారం ఉదయం వరకు ఈ దారిని పోలీసులు మూసివేశారు. చిన్నచిన్న వాహనాలనే అనుమతించారు. దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేసిన తర్వాత మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సుల రాకపోకలు కొనసాగాయి. జంపన్నవాగు, దయ్యాలవాగులో వరద ఉధృతి తగ్గుముఖం పడుతోంది. ఆదివారం తాడ్వాయి, ఏటూరునాగారం, గోవిందరావుపేట మండలాల్లో 6కేంద్రాలను ఏర్పాటుచేసి 489 మందిని తరలించారు. సోమవారం మూడు పునరావాస కేంద్రాలను తెరిచి 293 మందికి ఆశ్రయం కల్పించారు. తాడ్వాయి మండలంలోని నార్లాపూర్ పిడుగుపాటుకు ఒకరు, కాల్వపల్లిలో వరద నీటిలో మునిగి మరో యువకుడు మరణించగా.. శనివారం సాయంత్రం ఇదే మండలం బందాల వద్ద 17మేకలు వరదలో కొట్టుకుపోయాయి. ఇదే మండలంలో వరద ఉధృతికి 16 విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అధికారులు క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాల ప్రకారం.. 18 ఇళ్లు పాక్షికంగా దెబ్బతినగా ఓ ఇల్లు పూర్తిగా నేలమట్టమైంది. నాలుగు చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. పంట నష్టంపై వ్యవసాయాధికారులు సర్వే చేస్తున్నారు. వాగుల తీరంలో వరి చేలలో ఇసుక మేటలు వేయగా ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు మండలాల్లో మిరపనారు దెబ్బతింది. మేడారం వద్ద జంపన్న వాగు ఉధృతి ఆదివారం కంటే సోమవారం కాస్త తగ్గింది.

- హనుమకొండ జిల్లాలో సుమారు రూ.20 కోట్ల వరకు నష్టం జరిగినట్టు అధికారులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. పూర్తిస్థాయిలో పరిశీలన తర్వాత ఈ నష్టం ఇంకా ఎక్కువగా ఉండవచ్చునని చెబుతున్నారు. సోమవారం హనుమకొండ జిల్లాలో 6.95 సెమీ వర్షపాతం నమోదైంది. కానీ శనివారం రాత్రి ఆదివారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా పడిన వర్షంతో రోడ్లు ఎక్కువగా దెబ్బతిన్నాయి. చాలా చోట్ల రోడ్లపై గుంతలు పడ్డాయి. కొన్ని చోట్ల కోతకు గురయ్యాయి. దీంతో రోడ్లు భవనాల శాఖ అధికారులు ఉదయం జిల్లాలో పర్యటించి రోడ్లను పరిశీలించి సుమారు రూ.10 కోట్ల వరకు నష్టం జరిగినట్టు అంచనా వేశారు. ఇక జిల్లాలో చిన్నవి పెద్దవి సుమారు 1000 చెరువులు ఉండగా అవన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయి. పలు చెరువులకు గండ్లు పడగా.. కొన్నిటికి కట్టలు దెబ్బతిన్నాయి. నీటిపారుదల శాఖ అధికారులు వీటికి తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేశారు. ప్రాథమిక అంచనా ప్రకారం చెరువులకు సుమారు రూ. 5 కోట్ల వరకు నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. ఇక పంథిని, అయినవోలు మండలాల్లో 18విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగాయి. ఒక చోట ట్రాన్స్‌ఫార్మర్ పడిపోయింది. మరికొన్ని చోట్ల లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. అనేక చోట్ల పొలాల్లోకి నీరు చేరింది. దీంతో వరి, పత్తి, మొక్క జొన్న పంటలకు ఎక్కువ నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.


మహబూబాబాద్ మండలం వీఎస్ లక్ష్మీపురం వద్ద పెద్ద చెరువుకు గండిపడడంతో తెగిపోయిన బీటీరోడ్డు

- వరంగల్ జిల్లాలో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, మొత్తం 3,806మంది రైతులు సాగు చేస్తున్న 6,533 ఎకరాల్లో పంట నీట మునిగినట్టు ప్రాథమిక అంచనాకు వచ్చారు. నెక్కొండ మండలంలోని 8 గ్రామాల్లో 2,465మంది రైతుల సాగు చేస్తున్న 1,950 ఎకరాలలో వరి, 2,250 ఎకరాల్లో పత్తి, 410 ఎకరాల్లో మొక్కజొన్న కలిపి 4,610 ఎకరాల్లో పంట నీటమునిగిందని అధికారులు పేర్కొంటున్నారు. చెన్నరావుపేట మండలంలోని 13 గ్రామాలకు చెందిన 1,341 మంది రైతులు సాగు చేస్తున్న 1,008 ఎకరాల వరి, 735 ఎకరాల పత్తి, 180 ఎకరాల మొక్కజొన్న కలిపి 1,923 ఎకరాలలో పంట నీటమునిగిందని అంచనా వేశారు. పలుచోట్ల ముంపు బాధితులను ప్రజా ప్రతినిధులు, అధికారులు, పోలీసులు, డీఆర్ఎఫ్ బృందాలు పునరావాస కేంద్రాలకు తరలించారు. వరంగల్ నగరంలో జలమయమైన కాలనీల బాధితులకు పునరావాస కేంద్రాల్లో రెండు రోజుల నుంచి వారికి అన్నపానియాలు అందిస్తున్నారు. ఆదివారం జలమయమైన పలు రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు తగ్గముఖం పట్టింది. వరంగల్ మండలం పరిధిలో ముంపు కాలనీవాసులను ఆదివారం పునరావాస కేంద్రాలకు తరలించారు. వరంగల్‌లోని మర్వాడీ భవన్‌లో 150 మంది, శుభం గార్డెన్ 50మంది, కరీమాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 220 మందికి పునరావాసం కల్పించారు. 19వ డివిజన్ గాంధీనగర్‌లో ఇళ్లలోకి నీరు చేరడంతో మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావు చొరవతీసుకుని రెండు రోజుల నుంచి బాధితులకు ఆహారం అందిస్తున్నారు.
- జనగామ జిల్లాలో ఆదివారం కురిసిన వర్షంతో స్వల్ప నష్టం వాటిల్లింది. పలు మండలాల్లో సుమారు 278 ఎకరాల్లో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. వర్షపు నీరు కారణంగా పలు చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు సోమవారం పర్యటించారు. ఆయా మండలాల్లో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి నష్టం అంచనాను పరిశీలించారు. రోడ్లు ధ్వంసమైన చోట్ల తాత్కాలికంగా పునరుద్ధరణ పనులు చేపట్టారు. వర్షం కారణంగా పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా అధికారులు పునరుద్ధరించారు. జిల్లాలో 12 చోట్ల ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వివిధ మండలాల్లో 6చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు విరిగిపడడంతో జిల్లావ్యాప్తంగా 22 స్తంభాలు, 2 ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయి.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం తేలికపాటి వర్షం పడగా 28.2 మిల్లీమీటర్లు సగటు వర్షపాతం నమోదైంది. పలు మండలాల్లో ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గంగారం అలుగువాగు, పోతులవాయి బొర్రవాగు, ఒడిపిలవంచ ఎర్రవాగు, మల్లారం అలుగు వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఎగువన ఉన్న కడెం, శ్రీపాదఎల్లంపల్లి ప్రాజెక్టుల నుంచి లక్షలాది క్యూసెక్కుల వరదనీటిని కిందకి వదిలేస్తుండటంతో దామెరకుంట వద్ద గోదావరి, మానేరు నదులు ఉప్పొంగుతున్నాయి. గోపాల్‌పూర్ వాగు ఉప్పొంగి పరీవాహక ప్రాంతంలోని వరి పొలాలు, పత్తి చేలన్నీ మునిగిపోయాయి. దీంతో పాటు పలు మండలాల్లోని వరి, పత్తి చేలల్లోకి భారీగా వరద నీరు చేరడంతో పంటలకు నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

మల్హర్ మండలంలోని తాడిచర్ల ఓసీపీలో భారీ వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. రెండు రోజుల్లో 12 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.50 లక్షల ఓబీ వెలికితీత పనులు జరగాల్సి ఉండగా ఇవి స్తంభించిపోయాయి. ఓసీపీలోకి వరద నీరు భారీగా వచ్చి చేరడంతో మోటార్ల ద్వారా నీటిని బయటకు పంపిస్తున్నారు. అలాగే భూపాలపల్లి సింగరేణి ఏరియాలో భారీ వర్షాలకు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-2,3లలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది రహదారులు బురదమయం కావడంతో యంత్రాలు కదలలేని పరిస్థితి నెలకొంది. క్వారీలలో వర్షపు నీరు నిలవడంతో బొగ్గు వెలికి తీయడం సాధ్యపడలేదు. మూడు రోజులలో వర్ష ప్రభావంతో ఓసీ-2,3 ప్రాజెక్ట్ నుంచి సుమారు 17వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగిందని అధికారులు తెలిపారు. దీంతో సింగరేణికి సుమారు రూ. 60 కోట్లు నష్టం వచ్చిందని వివరించారు.


ఇంటికన్నె సమీపంలో ముమ్మరంగా జరుగుతున్న రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు

యుద్ధ ప్రాతిపదికన ట్రాక్ మరమ్మతులు

- ఇంటికన్నె వద్ద 8 పొక్లెయినర్లతో వేగంగా పనులు
- పరిశీలించిన రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్

కేసముద్రం, సెప్టెంబరు 2 : సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్‌లోని కేసముద్రం-ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య వరద ప్రవాహానికి ట్రాక్ కొట్టుకుపోయిన ప్రాంతంలో మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. ఇంటికన్నె సమీపంలో 418 కిలోమీటరు వద్ద పెద్దమోరీ వరద ఉధృతికి 30 మీటర్ల పొడవున రైల్వే ట్రాక్ ధ్వంసమై పట్టాలు గాలిలో వేలాడుతున్నాయి. ఇదే ప్రాంతంలో అక్కడక్కడ పట్టాల కింద కంకర, మట్టి వరద నీరు కొట్టుకుపోయింది. ఫలితంగా శనివారం రాత్రి నుంచి సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్ల మధ్య రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో రైల్వే డివిజన్ స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఆదివారం సాయంత్రం నుంచే మరమ్మతు పనులను చేపట్టారు. సోమవారం ఉదయం నాటికి వరద తగ్గుముఖం పట్టడంతో 8 ప్రొక్లెయినర్లతో రైలు కట్టను పునరుద్ధరిస్తున్నారు. ఈ పనులు పగలు, రాత్రి నిరంతరాయంగా కొనసాగేలా రైల్వే శాఖ ఏర్పాట్లు చేసింది. ఈ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సోమవారం మరమ్మతు పనులను పరిశీలించారు. మంగళవారం వరకు రైల్వే ట్రాక్ పునరుద్ధరించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా కేసముద్రంలో నిలిచిపోయిన సంగమిత్ర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు చెందిన ప్రయాణికులు సుమారు 6వేల మందిని 76ఆర్టీసీ బస్సుల్లో ఆదివారం అర్ధరాత్రి కల్లా వరంగల్‌కు తరలించారు. కేసముద్రం రైల్వే స్టేషన్‌లో రాత్రి వేళలో ప్రయాణికులకు, రైల్వే సిబ్బందికి స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్వింటా అన్నం వండించి భోజనం అందించారు.

నెక్కొండ స్టేషన్‌ను సందర్శించిన రైల్వే జీఎం

నెక్కొండ : దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సోమవారం వరంగల్ జిల్లా నెక్కొండ రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. భారీ వర్షాలకు నెక్కొండ-కేసముద్రం రైల్వేస్టేషన్‌ల మధ్య దెబ్బతిన్న రైల్వే ట్రాక్ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో నెక్కొండకు వచ్చిన జీఎం తొలుత నెక్కొండ రైల్వే స్టేషన్‌లో పరిసరాలను పరిశీలించారు. అనంతరం నెక్కొండ నుంచి టవర్ కారులో ట్రాక్ మరమ్మతు జరుగుతున్న కేసముద్రం వెళ్లారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జీఎం వెంట డీఆర్ఎం భరతేశ్‌కుమార్ జైన్, ఇతర రైల్వే అధికారులు, సిబ్బంది ఉన్నారు.


ఇంటికన్నె వద్ద ట్రాక్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్

మరమ్మతు చేస్తుండగా ఉద్యోగికి గాయాలు..

నెక్కొండ- కేసముద్రం రైల్వే స్టేషన్ల మధ్య దెబ్బతిన్న రైల్వేట్రాక్ మరమ్మతు పనులు చేస్తున్న క్రమంలో సోమవారం నెక్కొండకు చెందిన ఓహెచ్‌ఈ ఉద్యోగి ఆర్.సురేష్ తీవ్ర గాయాలైనట్టు రైల్వే అధికారులు తెలిపారు. మైలురాయి నెంబరు 418 వద్ద విద్యుత్ లైన్ల మరమ్మతు చేస్తుండగా ఎలక్ట్రికల్ స్ప్రింగ్ కట్‌అయి సురేష్‌కు తగలడంతో గాయాలయ్యాయన్నారు. దీంతో అక్కడే ఉన్న డోర్నకల్ రైల్వే డాక్టర్ ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం కాజీపేట రైల్వే ఆస్పత్రికి తరలించారు.

మత్తడి పోస్తున్న పాకాల


మత్తడి పోస్తున్న పాకాల చెరువు

ఖానాపురం, సెప్టెంబరు 2 : పాకాల సరస్సు చెరువు మత్తడి పోస్తోంది. వర్షాలతో గరిష్ఠ నీటిమట్టాన్ని చేరుకుంది. 30.3 అడుగుల పూర్తి సామర్థ్యం కాగా రెండు రోజులుగా రెండున్నర అడుగుల మేర అలుగు పోస్తోంది. దీంతో అశోక్‌నగర్ శివారులోని లో లెవల్ కాజ్‌వేపై నుంచి పాకాల వాగు ప్రవహించడంతో నర్సంపేట నుంచి పాకాల మీదుగా కొత్తగూడకు రాకపోకలు సోమవారం కూడా నిలిచిపోయాయి.

అధైర్యం వద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది

- అధికారులు సేవా దృక్పథంలో పనిచేయాలి
- ముందస్తు ప్రణాళికతో తగ్గిన నష్టం
- ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

మహబూబాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో వరద ముంపు ప్రాంతాలను సోమవారం ఆమె పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించారు. జిల్లా కేంద్రంతో పాటు నెల్లికుదురు మండలం రావిరాల, మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం, కేసముద్రం, బయ్యారం మండలాల్లో పర్యటించి దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జిలను పరిశీలించారు. ఆయా మండలాల్లో ప్రజలతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావం, సేవా దృక్పథంలో పనిచేయాలని సూచించారు. జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడంతో ప్రాణ, ఆస్తి నష్టం భారీగా తగ్గిందని పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, చెరువులు, కుంటలు ప్రమాదకర స్థాయిలో ఉండడంతో అటువైపు ప్రజలు వెళ్లకుండా చూడాలని పోలీసులకు సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఫైమెన్ కమిటీ వేసి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. వర్షాలతో కూలిన ఇళ్ల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. నిరంతరాయంగా ప్రజలకు వర్ష సమాచారం చేరవేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

తాగునీరు, పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలి

తాగునీరు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని మంత్రి సీతక్క వివరించారు.


మహబూబాబాద్-మరిపెడ రోడ్డులోని పురుషోత్తమయగూడెం వద్ద ధ్వంసమైన జాతీయ రహదారి

ధ్వంసమైన మానుకోట-మరిపెడ రోడ్డు

పరిశీలించిన మంత్రి సీతక్క


పురుషోత్తమయగూడెం వద్ద ధ్వంసమైన జాతీయ రహదారిని పరిశీలిస్తున్న మంత్రి ధనసరి సీతక్క

మహబూబాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లాలో జలప్రళయంతో మూడు చోట్ల జాతీయ రహదారులు కోతకు గురయ్యాయి. నష్టం సుమారు రూ.85 కోట్ల వరకు ఉంటుందని సమాచారం. ప్రధానంగా మహబూబాబాద్-మరిపెడ మార్గంలోని పురుషోత్తమయ గూడెం హైలెవల్ వంతెనకు మానుకోట వైపు జాతీయ రహదారి 365 ఒక కిలోమీటర్ అప్రోచ్ రోడ్డు కిలోమీటర్ మేర కొట్టుకుపోయింది. నష్టం రూ.10 కోట్ల మేరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోపక్క మహబూబాబాద్ నుంచి కురవి మీదుగా ఖమ్మం వెళ్లే జాతీయ రహదారిలోని ముల్కలపల్లి హైలెవల్ వంతెన 8 పిల్లర్ల పైన స్లాబ్ కొట్టుకుపోయింది. నష్టం సుమారు రూ.70 కోట్ల వరకు ఉంటుందని అంచనా కడుతున్నారు. నెల్లికుదురు మండలంలోని మరో జాతీయ రహదారిపై కొట్టుకుపోయిన రోడ్డు నష్టం రూ.5 కోట్ల వరకు ఉంటుందని చెబుతున్నారు. సమాచారం అందుకున్న రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క స్వయంగా జిల్లాలో సోమవారం అధికారులతో కలిసి సుడిగాలి పర్యటనలు నిర్వహించారు. నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు.

మంత్రి పర్యటన సాగిందిలా..

మంత్రి సీతక్క మహబూబాబాద్ జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల్లో సోమవారం విస్తృతంగా పర్యటించారు. తొలుత జిల్లా కేంద్రంలో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించిన ఆమె మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెంలో ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు. నెల్లికుదురు మండలం రావిరాల గ్రామంలో వరద బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కేసముద్రం మండలకేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్, సంతోష్‌నగర్, బయ్యారం మండలంలోని పాకాల ఏరు, పందిపంపుల వాగు, సుద్దరేవువాగు వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించారు. రాంచంద్రాపురంలో వర్షానికి కూలిన ఇంటి యజమానురాలికి ఆర్థిక సాయం అందించారు. తొలుత సొసైటీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారంపై వినతి పత్రం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, కోరం కనకయ్య, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, ఆర్డీవో అలివేలు, కాంగ్రెస్ నాయకులు సోమేష్, రాంమ్మూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, సీతారాంరెడ్డి, యాదవరెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది పనితీరు భేష్

- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి
- విరిగిన విద్యుత్ స్తంభాలు, సబ్‌స్టేషన్ల పరిశీలన


మహబూబాబాద్ మున్నేరు వాగు వద్ద విరిగిన విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 2: భారీ వర్షాలు సృష్టించిన విధ్వంస సమయంలోనూ రాత్రి, పగలు శ్రమించి విద్యుత్ సిబ్బంది పని చేయడం భేష్ అని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మహబూబాబాద్ జిల్లా జమాండ్లపల్లి, బయ్యారం, గుండ్రాతి మడుగు వద్ద మున్నేరు, పాకాల, ఆకేరు, పాలేరు వాగుల వద్ద వివిధ ప్రదేశాల్లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఆకేరు, పాలేరు, పాకాలవాగు ప రిసర ప్రాంతాల్లో నీట మునిగిన ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. అలాగే 33/11కేవీ విద్యుత్ స్తంభాల స్థానంలో శాశ్వత పరిష్కార టవర్ల ప్రతిపాదనను పంపాలన్నారు. దాదాపు 700స్తంభాలు, 106 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని తెలిపారు. సుమారు రూ.35లక్షల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. బయ్యారం, కొత్తపేట సెక్షన్ పరిధిలోని బ్రిడ్జి కింద మునిగిన స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. ఎంత వరద వచ్చినా నీట మునగకుండా ఉండేందుకు ట్రాన్స్‌ఫార్మర్లకు గద్దెలను నిర్మించాలన్నారు. గుండ్రాతి మడుగు ఫీడర్ పరిధిలో విరిగిన స్తంభాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. త్వరితగతిన పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని సూచించారు. గూడూరు సబ్‌స్టేషన్‌ను పరిశీలించి పునఃనిర్మాణానికి ప్రతిపాదనలను పంపాలన్నారు. మరిపెడ మండలం ఉల్లెపల్లి సబ్‌స్టేషన్‌ను చార్జ్ చేశామన్నారు. పట్టణ పరిధి, గ్రామాల్లో మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట విద్యుత్ ఎస్ఈ నరేష్, డివిజనల్ ఇంజనీర్లు పి.విజయ్, సునిత, ఏడీఈలు కవిత, ప్రశాంత్, ఏఈలు సంగీత, నవ్య, సుమన్, భోజ్యా నాయక్ ఉన్నారు.

ఆకేరు వాగులో గల్లంతైన మోతీలాల్ మృతదేహం లభ్యం


మోతీలాల్ మృతదేహం

మరిపెడ రూరల్, సెప్టెంబరు 2: ఖమ్మం జిల్లా గేట్‌కారేపల్లి గంగారం తండాకు చెందిన తండ్రి, కూతురు నూనావత్ మోతీలాల్(60), నూనావత్ అశ్విని కారులో హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో ఆదివారం తెల్లవారుజామున మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం వద్ద ఉన్న ఆకేరు వాగు ఉధృతిలో గల్లంతైన విషయం తెలిసిందే. వాగు ఉధృతి తగ్గాక బాల్ని ధర్మారం శివారు పామాయిల్ తోటలో నూనావత్ అశ్విని మృతదేహం లభించింది. ఇక మోతీలాల్ మృతదేహం ఆకేరు వాగులోని కిలోమీటరు పరిధిలో సోమవారం లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

విజయవాడ వరదల్లో మహాముత్తారం మండల వాసి గల్లంతు


లక్ష్మీరాజు (ఫైల్)

మహాముత్తారం, సెప్టెంబరు2: ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో సంభవించిన వరదల్లో భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలానికి చెందిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్లపల్లికి చెందిన బీసుల లక్ష్మీరాజు(19) ఇదే గ్రామానికి చెందిన మరో ఐదుగురు యువకులతో కలిసి విజయవాడలోని ఓ ఫ్లెక్సీ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. విజయవాడకు పది కిలో మీటర్ల దూరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి ఆదివారం సహచరులతో వెళ్లాడు. వాగు దాటుతుండగా లక్ష్మీరాజుతోపాటు విజయవాడకు చెందిన మరో యువకుడు గల్లంతయ్యారు. లక్ష్మీరాజు గల్లంతైన విషయాన్ని అతడి యజమాని ఫోన్ ద్వారా కుటుంబ సభ్యుల కు సోమవారం తెలియజేశాడు. ఈ నేపథ్యంలో మంత్రి శ్రీధర్‌బాబును గ్రామస్థులు కలిశారు. గాలింపు చర్యలు ముమ్మరం చేసేలా అక్కడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని కోరారు.

ఉద్యోగుల సక్రమంగా
విధులు నిర్వర్తించేలా చర్యలు
సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్

కాకతీయఖని, సెప్టెంబరు 2: భూపాలపల్లి ఏరియా సింగరేణి గనులు, డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగులు విధులను సక్రమంగా నిర్వర్తించేలా చర్యలు చేపట్టానని జనరల్ మేనేజర్ హబీబ్ హుస్సేన్ తెలిపారు. తాను జీఎంగా వచ్చేనాటికి 250 మంది డిప్యుటేషన్లలో ఉన్నారని, ఆ తర్వాత అదనపు మ్యాన్ పవర్‌ను పొజిషన్‌లో పెట్టానని అన్నారు. స్థానిక జీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియాలో మ్యాన్ పవర్ అస్తవ్యస్తంగా ఉందని, ఐఈడీ అధికారులతో చర్చించి ప్రక్షాళన చేశామని అన్నారు. ఏయే షిఫ్టులో ఎంత మంది ఉండాలనే విషయంలో కీలక నిర్ణయం తీసుకొని, అందుకు తగ్గ చర్యలు చేపట్టామని తెలిపారు. గత జీఎం హయాంలో 250 మంది కార్మికులకు డిప్యుటేషన్‌లో పనిచేశారని, ఇంకొంత మందిని తీసుకునేందుకు మే 15 వరకు అడ్వాన్స్‌గా అనుమతులు ఇచ్చి వెళ్లారని అన్నారు. అవి నిబంధనలకు విరుద్ధం కావడంతో వాటిని ఆమోదించలేదని తెలిపారు. ప్రస్తుతం డిప్యుటేషన్లు అత్యవసరమైతే తప్ప ఎవరికీ ఇవ్వడంలేదన్నారు. ఎమర్జెన్సీ ఉన్న కార్మికులను కార్పొరేట్‌కు పంపించి వారి అనుమతులతో డిప్యుటేషన్ ఇస్తున్నామన్నారు. ఏరియాలో 5వేలకు పైగా క్వార్టర్లు ఉన్నాయని, వాటిలో సుమారు 250కు గత అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించలేదన్నారు. రామప్ప కాలనీలోని డబుల్ బెడ్‌రూం క్వార్టర్లలో 33కు కౌన్సెలింగ్ నిర్వహించలేదని తెలిపారు. దీనిపై సబంధిత అధికారులను అడిగితే ఇప్పటికీ తనకు సమాధానం చెప్పలేదని అన్నారు. తాను జీఎంగా బాధ్యతలు తీసుకున్నాక సెక్యూరిటీ సిబ్బందిని పంపి క్వార్టలర్లలో ఎవరెవరు ఉంటున్నారనే విషయాన్ని ఆరా తీస్తున్నానని తెలిపారు. ఈనెల 7న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించానని, గత సంవత్సరం కంటే ఈసారి ఎక్కువ బొగ్గు ఉత్పత్తిని సాధిస్తామ అన్నారు. కొండంపల్లి రైతులు గని వద్ద ఆందోళనకు దిగుతున్నారని, వారికి ఇంచు భూమికి డబ్బులు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు.

బొగ్గు ఉత్పత్తి టార్గెట్.. 3.58 లక్షల టన్నులు

సింగరేణి భూపాలపల్లి ఏరియాకు ఈ నెల 3,58,700 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని యాజమాన్యం నిర్దేశించిందని ఐఈడీ అధికారులు వెల్లడించారు. ఆగస్టులో 67శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించామని తెలిపారు. రోజుకు సుమారు 12వేల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించాల్సి ఉందన్నారు. భూపాలపల్లి ఏరియా ప్రస్తుతం రూ. 548 కోట్ల నష్టంలో నడుస్తోందని ఫైనాన్స్ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు జ్యోతి, సురేఖ, మారుతి, రాజు, శ్రావణ్‌కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

దేవాలయం భూమి ఆక్రమణ!

చిట్యాల, సెప్టెంబరు 2: మండలంలోని జడల్‌పేట, బావుసింగ్‌పల్లి గ్రామాల సరిహద్దులోని మధన పోషమ్మ ఆలయం ప్రాంతం ఆక్రమణకు గురైంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... రెండు గ్రామాల శివారు కొండెంగల ఒర్రె ఒడ్డుపక్కన ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 316లో గ్రామ దేవతా విగ్రహాన్ని నెలకొల్పి ఏళ్లుగా పూజలు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం జడల్‌పేట గ్రామానికి చెందిన ముజాహిద్, సర్వర్ ఆలయం భూమి ప్రాంతంలో హరితహారం మొక్కలను ట్రాక్టర్ యంత్రంతో దుక్కిచదును చేశారు. గ్రామ దేవత భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులపై, ట్రాక్టర్ యాజమానిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కామిడి రత్నాకర్‌రెడ్డి, కాత్రేవుల సాయిలు, గుజ్జ తిరుపతిరావు, అలువాల సాంబయ్య, నరేష్, ప్రతాప్‌రెడ్డి, నందరాజు. విజేందర్ డిమాండ్ చేశారు.

బొగ్గులవాగును పరిశీలించిన కాంగ్రెస్ నేతలు

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 2: ములుగు మండలంలోని సర్వాపూర్-జగ్గన్నగూడెం గ్రామాల మధ్యలో ఉన్న బొగ్గులవాగు వరద ఉధృతిని సోమవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా నాయ కులు మాట్లాడుతూ వాగు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండా లని అన్నారు. బొగ్గులవాగుపై హైలెవల్ వంతెన నిర్మాణం కోసం మంత్రి సీతక్క కృషి చేస్తుందని అన్నారు. ముంపునకు గురైన పంటలకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

9 నుంచి దివ్యాంగుల శిబిరాలు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 2: జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో సదరం సర్టిఫికెట్ కలిగిన దివ్యాంగులకు అవసరమైన పరికరాల పంపిణీకి ఈ నెల 9 నుంచి 12 వరకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్టు జిల్లా సంక్షేమాధికారి చెన్నయ్య తెలిపారు బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్, కాలిపర్స్, కృత్రిమ కాళ్లు, వినికిడి మిషన్లు, వీల్ చైర్లు, స్టిక్స్‌ను అలీ కో సంస్థ సౌజన్యంతో ఎంపిక చేస్తామన్నారు. 9న మహదేవపూర్ తహసీల్ కార్యాలయం ఆవరణలో పలిమెల, మహదేవపూర్, మల్హర్ మండలాలకు సంబంధించిన వారికి, 10న మహాముత్తారం తహసీల్ కార్యాలయం ఆవరణలో మహాముత్తారం, కాటారం వారికి, 11న జెడ్పీ సీఈవో కార్యాలయం ఆవరణలో భూపాలపల్లి, రేగొండ, గోరికొత్తపల్లి, గణపురం వారికి, 12న చిట్యాల తహసీల్ కార్యాలయ ఆవరణలో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన దివ్యాంగులకు ఈ శిబిరాలు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు తమ కార్యాలయంలో గానీ, 9652311804 అనే నెంబర్‌లో గాని సంప్రదించాలని ఆయన కోరారు.

ఆంధ్రజ్యోతి Classifieds
Wanted Real Estate Health Beautician Jobs For Sale

WANTED TEACHERS
★ Maths 1st to 5th (Un-Married), Telugu 1st to 8th Class, P.E.T. (Un-Married) New Vision School. Near Girnibavi (Vill), Laknepally (Mdl), Narsampet, Dist.Wgl Cell: 9550633624, 9849464761.
AJW-188285

PLOTS FOR SALE
★ ములుగురోడ్డుకు దగ్గరలో ఆరేపల్లి NSR ప్రతిమా హాస్పిటల్ పరిసర ప్రాంతాలలో & 30 KM లోపు గల ప్లాట్లు మరియు భూములు కొనబడును మరియు అమ్మబడును. సం.ప్ర: 9281141001
AJW-3949

WANTED
★ ప్రముఖ రియల్ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు ములుగు, భూపాలపల్లి జిల్లాలో రియల్ఎస్టేట్ ఏజెంట్లు కావలెను. రిటైర్డ్ ఉద్యోగులు, గృహిణీలు, LIC ఏజెంట్లకు సదవకాశం, ఆకర్షణీయమైన జీతం కలదు. సం॥ప్ర : 7416975767, 8978118889
AJW-199172

PLOT FOR SALE
★ HNK Kits, కాలేజీ అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గరలో 466 చ॥గ ప్లాటు(40×105) అమ్మబడును. సం॥ప్ర॥ 9553255936.
AJW-199018

WANTED
★ ప్రముఖ కాలేజ్ హాస్టల్లో పని చేయుటకు అనుభవం కలిగిన వంట మాస్టర్ (మగ), మరియు లేడీ వార్డెన్స్ (ఫుల్‌టైమ్) కావలెను. సం॥ప్ర॥ 6305190609, 7386976303
AJW-199174

సెక్యూరిటీ గార్డ్స్ మరియు సూపర్ వైజర్స్ కావలెను
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్ వైజర్స్ అర్జెంటుగ కావలెను. జీతం 12,000-15,000 సెల్: 9440414616
AJW-199085

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013 8978510273
వరంగల్ 9985406150 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9985418040
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.
3+2 స్కీం కలదు

అధిక వర్షాలు.. తీరని కష్టాలు


మేడారం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్న వాగు


ఏటూరునాగారం మండలం రొయ్యూరు గ్రామంలో నీటమునిగిన మిర్చినారు మళ్లు

తాడ్వాయి, సెప్టెంబరు 2: రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా పంట పొలాల్లో ఇసుకమేటలు వేశాయి. ఇటీవల నాట్లు వేసిన అతి కొద్దిరోజుల్లోనే భారీ వర్షాలు కురవడం, ఇసుక మేటలు వేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తాడ్వాయి, ఇందిరానగర్, నర్సింగాపూర్, కాటాపూర్, బీరెల్లి, రంగాపూర్, దామెరవాయి, లింగాల, కొడిశాల, తదితర గ్రామాల్లో చిన్నచిన్నవాగులు, వంకలు, చెరువులు తెగిపోయి పంటపొలాల మీదుగా వరద ప్రవాహం వెళ్లడంతో ఒడ్లు తెగిపోయి ఇసుక మేటలు వేసి భారీ నష్టాన్ని మిగిల్చాయి. దీనిపై వ్యవసాయ, రెవెన్యూశాఖల అధికారులు స్పందించి సర్వే చేపట్టి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా మండలంలో కురిసిన భారీ వర్షాలతో మండలంలోని బందాల గ్రామంలో నాలి నర్సయ్య, నాలి నడిపి నర్సయ్య, చెరుకుల ఎల్లయ్యలకు చెందిన 17మేకలు వరదలో కొట్టుకుపోయి మృతిచెందాయి. దీంతో భారీగా నష్టపోయామని, తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

- మేడారం : తాడ్వాయి మండలం మేడారం జంపన్నవాగు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు సోమవారం వరద నీరు వాగులో చేరుతుండడంతో జంట వంతెనలకు మీటరు దిగువగా ప్రవాహం కొనసాగింది. ఇంకా వర్షాలు కురిసే సూచనలు ఉండటంతో అధికారులు ప్రజలకు అప్రమత్తం చేశారు. వాగులు, ఒర్రెలు, కాల్వలు దాటొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

- ఏటూరునాగారం రూరల్ : రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని దొడ్ల-మల్యాల గ్రామాల మధ్యగల జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మల్యాల, కొండాయి, గోవిందరాజుల కాలనీలకు రాకపోకలు నిలిచిపోగా ఆయా గ్రామాల ప్రజల సౌకర్యార్థం అధికారులు వాగుపై రాకపోకలు సాగించేందుకు రెండు పడవలను ఏర్పాటు చేశారు. పడవ ద్వారా గ్రామస్థులు తమ అవసరాల నిమిత్తం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తున్నారు. అదేవిధంగా మండలంలోని బానాజీబంధం, ఎలిశెట్టిపల్లి గ్రామాల మధ్యగల జంపన్నవాగు ఉధృతి కారణంగా ఎలిశెట్టిపల్లి వాసులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోగా అధికారులు వాగుపై నాటు పడవను ఏర్పాటు చేసి రవాణాను పునరుద్ధరించారు.

- కాటారం : మండలంలో ఆదివారం రాత్రి, సోమవారం కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. భారీ వర్షంతో గంగారం అలుగువాగు, పోతులవాయి బొర్రవాగు, ఒడిపిలవంచ ఎర్ర వాగు, మల్లారం అలుగు వాగులు భారీవర్షానికి పొంగిపొర్లాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఎవరూ దాటకుండా పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. భారీ వర్షాలతో పాటు ఎగువన ఉన్న కడెం, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుల నుంచి లక్షలాది క్యూసెక్కుల వరదనీటిని కిందకి వదిలేస్తుండటంతో దామెరకుంట వద్ద గోదావరి, మానేరు నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షం ధాటికి గోపాల్‌పూర్ వాగు ఉప్పొంగి పరీవాహక ప్రాంతంలోని వరి పొలాలు, పత్తి చేలన్నీ వరద నీటితో చెరువులను తలపిస్తున్నాయి. జాదరావుపేట వద్ద ఇప్పమాటు ఉప్పొంగి వరి పొలాలు నీటమునిగాయి. పెద్దవాగు ఉప్పొంగడంతో దామెరకుంట, మల్లారం, గంగపురి, గుండ్రాత్ పల్లి పరిధిలో పత్తి చేలల్లోకి భారీగా వరద నీరు చేరడంతో పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

- ఏటూరునాగారం : మండలంలోని రొయ్యూరు, శంకరాజుపల్లి, ముల్లెకట్ట, రాంపూర్, రామన్నగూడెం, పప్కాపురం తదితర గ్రామాలల్లో మొలకెత్తిన మిర్చి నారుమళ్లు వర్షాల కారణంగా ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. వరదల కారణంగా మండల వ్యాప్తంగా మిర్చి నారుమల్లుకు జరిగిన నష్టంపై వ్యవసాయ అధికారుల వెంటనే సర్వే నిర్వహించి లక్షలాది రూపాయలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరింహారం అందించి అన్ని విధాల ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

- మల్హర్: మండలంలోని వల్లెంకుంట, కుంభంపల్లి, తాడిచర్ల, మల్లారం గ్రామశివారులో రైతులు మానేరులో ఏర్పాటు చేసుకున్న మోటార్లు, స్టాటర్లు కొట్టుకొని పోయాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం వల్ల మానేరులో వరద ఉధృతి పెరిగి నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. తాడిచర్ల, పీవీనగర్ వద్ద మానేరు వరద ఉధృతి రెండు మీటర్ల ఎత్తులో సాగుతోంది. మల్లారం వద్ద ఆరెవాగులో వరద ప్రవాహం పెరిగింది.

- రేగొండ : మండల కేంద్రలోని వాగిండి భాగ్యలక్ష్మికి చెందిన ఇల్లు అధిక వర్షాలకు నేల కూలింది. సమయానికి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్‌శ్వేతారావు సంఘటన స్థలం చేరుకొని పరిశీలించారు.

పెరుగుతున్న గోదావరి

మహదేవపూర్, సెప్టెంబరు 2 : మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమ గోదావరి మూడు రోజులుగా భారీ వర్షాలకు పరవళ్లు తొక్కుతోంది. ప్రాజెక్టుల గేట్లు తెరవడం, వాగులు వంకలు ఉప్పొంగడంతో పాటు మానేరు వరద చేరడంతో గోదావరి ప్రవాహం పెరిగింది. కాళేశ్వరం వద్ద 10 మీటర్లకు పైగా ప్రవాహంతో ప్రవహిస్తోంది.

- ఏటూరునాగారం రూరల్ : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఎగువ ప్రాంతాల్లో ప్రధాన ప్రాజెక్టుల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి క్రమంగా పెరుగుతోంది. సోమవారం నీటిమట్టం 10.940 మీటర్లు నమోదైంది. సాయంత్రం 6 గంటలకు 11.100 మీటర్లకు చేరింది.

- వాజేడు : భారీ వర్షాలకు మండలంలోని గోదావరి క్రమేణా పెరుగుతోంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో సైతం భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో పేరూరు వద్ద గోదావరి పెరుగుదల ప్రారంభమైంది. ఉదయం 8గంటలకు 10.68 మీటర్ల నీటిమట్టం ఉన్న గోదావరి 10గంటలకు 10.88 మీటర్లు, 12కు 11.00 మీటర్లు, 2 గంటలకు 11.34మీటర్లు, సాయంత్రం 5కు 11.71 మీటర్లకు చేరింది.


కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి ఉధృతి

- ఏటూరునాగారం రూరల్ : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఎగువ ప్రాంతాల్లో ప్రధాన ప్రాజెక్టుల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి క్రమంగా పెరుగుతోంది. సోమవారం నీటిమట్టం 10.940 మీటర్లు నమోదైంది. సాయంత్రం 6 గంటలకు 11.100 మీటర్లకు చేరింది.

- మంగపేట : మండలంలోని కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్‌వెల్ వద్ద సోమవారం మధ్యాహ్నం గోదావరి నీటిమట్టం 7 మీటర్ల 80 సెంటీ మీటర్ల నమోదైంది. నది తాకిడికి కమలాపురం, మంగపేట, పొద్మూరు, బోరునర్సాపురం వరకు వ్యవసాయ భూములు కోతకు గురవుతున్నాయని బాధిత రైతులు తెలిపారు.

- కన్నాయిగూడెం :మండలంలోని తుపాకులగూడెంలోని సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి పెరగుతూ వస్తోంది. భారీ వర్షాలకు తోడు మేడిగడ్డ బ్యారేజి గేట్లు ఎత్తి దిగువకు వదులుతుండట, ఉప నదులు ప్రాణహిత, ఇంద్రావతి కలుస్తుండటంతో గోదావరి ప్రవాహం పెరిగింది. 4,21,380 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో బ్యారేజీలోని అన్ని గేట్లు ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద 78.90 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

దేవాదుల పంపింగ్ బంద్

మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె. చొక్కారావు దేవాదుల ఎత్తి పోతల ప్రాజెక్టులో సోమవారం పంపింగ్‌ని నిలిపి వేశారు. ఆదివారం వరకు పంపింగ్‌ను కొనసాగించిన అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలతో బంద్ చేశారు. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద నీటిమట్టం 79.50 మీటర్లు నమోదైంది.

నవరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేయాలి
అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ


మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 2: గణపతి నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాలపై పోలీస్, రెవెన్యూ, పంచాయితీరాజ్, విద్యుత్, మునిసిపాలిటీ, మత్స్యశాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గణపతి నవరాత్రి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తావులేకుండా పకడ్బందీ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం సందర్భంగా వాగులు, చెరువుల వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అంబులెన్స్, మెడికల్ క్యాంపులను ఏర్పాటుచేయాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీపీవో నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి : ఏఎస్పీ

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 2: గణేష్ ఉత్సవాలను ప్రజలందరూ శాంతియుతంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని స్థానిక ఏఎస్పీ కార్యాలయంలో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులతో ఏఎస్పీ సమావేశం నిర్వహించారు. మండపాల వివరాలను స్థానిక పోలీసుస్టేషన్లలో నమోదు చేసుకోవాలని, నిబంధనల మేరకు నడు చుకోవాలని ఏఎస్పీ సూచించారు.

వైఎస్ఆర్‌కు ఘన నివాళి


టేకుమట్లలో వైఎస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నేతలు

టేకుమట్ల, సెప్టెంబరు 2 : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళుల ర్పించారు. దాసారపు సదానందం, మోతే రాజమౌళి, మాదం కొమరయ్య, శాస్త్రాల కిరణ్, బండ శ్రీకాంత్, వంగ నరేష్, రాజేందర్, విజేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

- ఏటూరునాగారం: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ. ఖలీల్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నరసింహారావు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కొండగొర్ల పోషయ్య, యూత్ ప్రధాన కార్యదర్శి ఎమ్డీ. గౌస్ పాషా, సీనియర్ నాయకులు కె. రంజిత్, ఈసం నర్సయ్య, సరికొప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- గోవిందరావుపేట: మండల కేంద్రంలో జరిగిన వైస్ వర్ధంతిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రస్పూత్ సీతారాం నాయక్, నాయకులు తేళ్ల హరిప్రసాద్, కణతల నాగేందర్‌రావు, సూదిరెడ్డి జనార్దన్ రెడ్డి, జెట్టి సోమయ్య, సాయిబాబు, నాగమణి, పెండెం శ్రీకాంత్, జంపాల చంద్రశేఖర్, పులుగుజ్జు వెంకన్న, చింత క్రాంతి, పడిదల సాంబయ్య, రామచంద్రపు వెంకటేశ్వర్‌రావు, పూర్ణతోపాటు పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

- వెంకటాపురం(నూగూరు) : మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్‌హుస్సేన్, నాయకులు చిడెం శివ, తోట శ్రీను, ధనపనేని నాగరాజు, కొండపర్తి సీతాదేవి, చిట్టెం సాయి, రమేష్, ఐలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

- మంగపేట : మండల కేంద్రంలో జరిగిన వైఎస్ వర్ధంతిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి, జిల్లా, నియోజకవర్గం, బ్లాక్ కాంగ్రెస్, మండల, గ్రామ స్థాయి నాయకులు, అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలని గ్రామస్థుల నిరసన

మేడారం, సెప్టెంబర్ 2 : తాడ్వాయి మండలం పడిగాపూర్, ఎలుబాక మధ్య జంపన్నవాగుపై పెద్ద వంతెన నిర్మించాలని రెండు గ్రామాల ప్రజలు సోమవారం నిరసనకు దిగారు. వాగు పై చిన్న సిమెంట్ పైపుల వంతెన నిర్మించి వదిలేశారని, దీంతో వర్షాలకు వరద తాకిడి పెరిగి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఒకవైపు జంపన్నవాగు మరో వైపు పాలవాగు చెరువు మత్తడి గ్రామం చుట్టూ వరదలు వస్తున్నాయని అన్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వరదలు తగ్గేంత వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతకాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కాయం ఎల్లయ్య, సుదర్శన్‌రెడ్డి, దోబె నాగేశ్వరావు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ములుగు అడవిలో చిరుత సంచారం
(5వ పేజీ తరువాయి)

స్థలికి చేరుకొని మగ చిరుతవని పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో పాకాల అభయారణ్యం నుంచి ములుగు సౌత్ బీట్ మీదుగా సర్వాపురం, జగ్గన్నపేట నుంచి మదనపల్లి వైపు చిరుత వచ్చినట్లు ట్రాక్ చేశారు. వెంటనే 30 మంది బేస్‌క్యాంపు, సెక్షన్, బీట్ అధికారులను రంగంలోకి దించారు. సాయంత్రం వరకు ఆ పులి లోకం చెరువు పరీవాహకం మీదుగా గట్టమ్మ గుట్టలవైపు వచ్చినట్లు తేలింది. అటు నుంచి జాకారం, భూపాల్‌నగర్, మల్లంపల్లి అటవీ ప్రాంతానికి వెళ్తుందా, రోడ్డుదాటి ప్రేమ్‌నగర్, బండారుపల్లి వైపుకు వస్తుందా..? అని అటవీ అధికారులు అన్వేషిస్తున్నారు. పొట్లాపూర్ అవతలివైపు అడవులు కొత్తగూడ, పాకాల అడవుతో కలిసి ఉండగా ఆప్రాంతంలో కూరమృగాల సంచారం ఉంటుంది. కానీ, మొదటి సారిగా ములుగు వైపుకు వచ్చినట్లు స్పష్టమవుతోంది. భారీ వర్షాలకు అడవుల్లో వాగులు ఉప్పొంగడంతో పులి గ్రామాల వైపుకు వచ్చినట్లు ఫారెస్టు అధికారులు భావిస్తున్నారు. చిరుత సంచరిస్తున్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. రాత్రివేళ బయటకు రావొద్దని, ఆచూకీ కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. వన్యప్రాణులకు హాని తలపెట్టడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు.

సామాన్యుడిలా వచ్చి..
డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకున్న జడ్జి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 2: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పి. నారాయణబాబు సాదాసీదాగా వ్యవహరించారు. ఓ సామా న్యుడిలా వచ్చి జిల్లా రవాణాశాఖ అధికారి కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ చేయించుకున్నారు. జడ్జి వ్యవహరించిన తీరును చూసిన వారంతా ఆయన్ను అభినందించారు.


లైసెన్స్ రెన్యూవల్ కోసం ఫొటో దిగుతున్న జిల్లా జడ్జి నారాయణబాబు

పాత్రాపురం రైతువేదికలో చోరీ

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 2: మండలంలోని పాత్రాపురం గ్రామంలోని రైతు వేదికలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు రైతువేదిక గ్రిల్స్‌ను తొలగించి బ్యాటరీ, ఇన్వర్టర్‌ను దొంగిలించారని ఏఈవో శ్యామ్ తెలిపారు. ఈసంఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్



భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 2: ఆర్యవైశ్య మహాసభ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా కటారాం మండలానికి చెందిన పవిత్రం శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని శ్రీవాసవీమాత దేవా లయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమం జరిగింది. ఎన్నికల కమిటీ కన్వీనర్‌గా వంగేటి అశోక్‌కుమార్ వ్యవ హరిం చారు. సంఘం నాయకులు శాంతకుమార్, ముక్తేశ్వర్, శ్రీనివాస్, నవీన్‌కు మార్, సూర్యనారాయణ, దేవేందర్, వరప్రసాద్, శ్రీమాన్ పాల్గొన్నారు.

హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించాలి : బీజేపీ

తాడ్వాయి, సెప్టెంబరు 2: తాడ్వాయి- పస్రా మధ్య ఉన్న జనగలంచ, మొండ్యాలతోగుపై హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బర్లపురం నరేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఆయన ఆధ్వర్యంలో నాయకులు జనగలంచ, మొండ్యాలతోగు వద్ద వరదలతో దెబ్బతిన్న జాతీయ రహదారిని పరిశీలించారు. నరేష్ మాట్లాడుతూ గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఈప్రాంతంలో రోడ్డు ధ్వంసమైందని, అయినప్పటికీ మంత్రులు, సంబంధిత అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరద తాకిడి ఎక్కువై రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని అన్నారు. ఇప్పటికైనా మంత్రులు, సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు ద్యాగల సలేందర్, సిద్దబోయిన సురేందర్ తదితరులు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో సత్తా చాటాలి
ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు నవనీత్

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 2: యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో జిల్లా నుంచి భారీ మెజారిటీతో సత్తా చాటాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి నవనీత్ కోరారు. మండలంలోని పాపయ్యపల్లి, నర్సాపూర్ గ్రామాల్లో సోమవారం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అభ్యర్థి వంచ రిషికేష్‌రెడ్డి, గణేష్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'మంత్రి సీతక్కపై ఆరోపణలు సరికాదు'

గోవిందరావుపేట, సెప్టెంబరు 2: తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్కపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని మండల ఆదివాసీ యువ నాయకుడు మైపతి అరుణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల దేవాదుల ప్రాజెక్టును పరిశీలించడానికి వచ్చిన మంత్రులపై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తూ బురద చల్లాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. కాళేశ్వరం, పాలమూరు, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల్లో గత ప్రభుత్వం చేసిన దోపిడీ కనిపించలేదా? అని ప్రశ్నించారు.

బ్లాస్టింగ్ తాకిడికి పాక్షికంగా కూలిన ఇల్లు!

మల్హర్, సెప్టెంబరు 2: తాడిచర్ల ఓసీపీలో నిత్యం జరిగే బ్లాస్టింగ్ వల్ల తమ ఇల్లు కూలిందని బాధితులు దేవర రాజనర్సు, గంగమ్మ దంపతులు సోమవారం ఆరోపించారు. నిత్యం ఓసీపీలో జరిగే బ్లాస్టింగ్ వల్ల ఇంటి గోడ బీటలు వారిందని, దానికి తోడు వర్షం వల్ల ఇంటి ఒక పక్క గోడ కూలిందని తెలిపారు. ఇంటి గోడ కూలడం వల్ల సామగ్రి చెల్లచెదురయ్యాయన్నారు. కూలిన ఇంటికి ఓసీపీ అధికారులు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

చిట్యాల ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా రామకృష్ణ

చిట్యాల, సెప్టెంబరు 2: చిట్యాల ఇన్‌చార్జి ఎంపీడీవోగా అయిత రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో జయశ్రీ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లగా ఎంపీవో రామకృష్ణకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్వర్వులు జారీ చేశారు.